క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు


తుని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న సీడీపీఓ జ్యోతి

తుని రూరల్: నియోజకవర్గంలోని తుని, కోటనందూరు, తొండంగి మండలాలు, తుని పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఐసీడీఎస్ కాకినాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రవీణ పర్యవేక్షణలో తుని, పెద్దాపురం, తాళ్లరేవు, ప్రత్తిపాడు, జగ్గంపేట, శంఖవరం, కాకినాడ జిల్లా నోడల్ అధికారి వై.లక్ష్మి, సీడీపీఓలు అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు, సరకు నిల్వలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులతో మాట్లాడి సరుకులు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. తనిఖీల్లో సీడీపీఓలు వి.మాధవి, ఎ.జ్యోతి, ఆర్‌పీఎస్ లక్ష్మి, ఎం.పూర్ణిమ, టీడీఆర్ పద్మ, కె.శ్రీలత, జి.ఉషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ-పంట నమోదు వివరాలు


రౌతులపూడి ఆర్‌బీకే నోటీసు బోర్డులో ఈ-పంట వివరాలు అతికిస్తున్న దృశ్యం

రౌతులపూడి: గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ఈ-పంట నమోదు వివరాలను ప్రదర్శించినట్టు మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు గురువారం తెలిపారు. రైతులు ఈ నెల 26, 27, 28 తేదీల్లో వివరాలను పరిశీలించుకోవాలన్నారు. పంట నమోదులో ఏమైనా తేడాలు ఉంటే వాటిని సరి చేసుకోవాలన్నారు. ఏమైనా సర్దుబాట్లు ఉంటే ఈ నెల 29 లోగా స్థానిక రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పూర్తి సమాచారాన్ని అందించి సరి చేసుకోవాలని సూచించారు. ఈ-పంట నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, నష్ట పరిహారం వర్తిస్తాయని తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


లంపకలోవలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు గంటా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ గొళ్ల కాంతి సుధాకర్ ప్రారంభించారు. కాకినాడ అంజు ఆసుపత్రి వైద్యులు సుమారు 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, జేసీఎస్ మండల కన్వీనర్ రామిశెట్టి చినబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, గుడాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు తొండంగిలో మంత్రి రాజా పర్యటన

తొండంగి: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా శుక్రవారం తొండంగిలో పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు గురువారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఏపీకి జగనే ఎందుకు కావాలి ? (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రత్తిపాడు రూరల్: శ్రీదేవి నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని గజ్జనపూడిలో శుక్రవారం నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గురువారం నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ప్రత్తిపాడు పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామానికి చెందిన ఇంజరపు చందుకుమార్ (20) ఈ నెల 25వ తేదీ రాత్రి మండలంలోని గజ్జనపూడిలో టెంట్‌హౌస్ సామగ్రి వాహనంపై తరలిస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఏఎస్సై ఆదినారాయణ తెలిపారు.


హంసవరంలో వైద్యపరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటున్న రోగులు


టి.రాయవరంలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్


మామిడాడలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఒమ్మి రఘురాం తదితరులు

అనారోగ్య రహిత గ్రామాలే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు


గుమ్మళ్లదొడ్డిలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: అనారోగ్య రహిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ఎస్.తిమ్మాపురంలో సర్పంచ్ మండేటి వీరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ తోట రవితో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తోందన్నారు. విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు పోషకాహార కిట్లు, రోగులకు మందుల కిట్లను ఎమ్మెల్యే చంటిబాబు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, గండికోట లోవరాజు, తాటిపర్తి బాబులు, చిన్ననాగరాజు, మండేటి రామకృష్ణ, ఉమ్మిడి దొరబాబు, ఉమ్మిడి వీరాస్వామి, బొజ్జపు శ్రీను, బేరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. వైద్య సేవలు పొందిన వారికి మందుల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సర్పంచ్ సరకణం రామలక్ష్మి, నాయకులు దాసరి సతీష్‌బాబు, సరకణం మురళి, పి.చిన్ని, రామబ్రహ్మం, బూలా అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: ప్రజారోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తాళ్లూరులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబ్బిణ్ణి వీరబాబు, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, జెడ్.రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, జగ్గంపేట జేసీఎస్ మండల కన్వీనర్ బండారు రాజా, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాలచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. మండలంలోని మామిడాడలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ వసంతకుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు.

తుని రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటా ఆరోగ్యం మెరుగు పడుతోందని హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ అన్నారు. హంసవరంలో గురువారం ఎంపీడీఓ పి.రవికుమార్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిడజాంలో జగనన్న ఆరోగ్య సురక్ష

రౌతులపూడి: మండలంలోని గిడజాంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు 403 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో ఐదుగురిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కంటి వెలుగులో భాగంగా 153 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 150 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.గోవిందు, సర్పంచ్ ఎన్.పరంజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు టి.వెంకటరమణ, ఎస్.రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ వైద్య సేవలు

ప్రత్తిపాడు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ గొళ్ల కాంతిసుధాకర్ అన్నారు. మండలంలోని టి.రాయవరంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తటవర్తి రామన్నదొర, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, లంపకలోవ సొసైటీ డైరెక్టర్ బత్తుల నాగార్జున, సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ రామిశెట్టి చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సూరంపూడి సూరరాజు, కొండి శ్రీను, గుడాల వెంకటరత్నం, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


ఎస్.తిమ్మాపురంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ఎస్.తిమ్మాపురంలో 61.8 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రజలు ప్రభుత్వ సేవల కోసం పనులు మానుకొని మండల కేంద్రాలకు వెళ్లవలసి వచ్చేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక గ్రామాల్లోనే అన్నిరకాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, సర్పంచ్ మండేటి వీరలక్ష్మి, వనపర్తి వీరభద్రరావు, రాసనబోయిన శ్యామ్, పెద్దియ్య, ఓలేటి రాజు, ఏఓ జోకా అమృత తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి

తుని: పట్టణ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రజలు సహకరించాలని పట్టణ సీఐ గీతా రామకృష్ణ కోరారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో వాహనాల రాకపోకలను గురువారం సీఐ పరిశీలించారు. గొల్ల అప్పారావు సెంటర్ నుంచి బాలాజీ సెంటర్ వరకూ నిత్యం రద్దీ ఉంటోందన్నారు. ఏయే ప్రాంతాల్లో స్ట్రీట్ వెండర్లకు స్థలం కేటాయించాలనే అంశంపై అధికారులతో చర్చించారు. పట్టణంలో ఎంతమంది స్ట్రీట్ వెండర్లు ఉన్నారో రిజిస్ట్రేషన్ ద్వారా తెలుస్తుందన్నారు. మున్సిపల్ అధికారులతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

- ఈఆర్‌ఓ సత్యనారాయణ మూర్తి


రాజకీయ పార్టీల నాయకులు, ఏఈఆర్‌ఓలతో సమీక్షిస్తున్న ఈఆర్‌ఓ సత్యనారాయణమూర్తి

తుని రూరల్: ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని తుని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలతో గురువారం ఆయన వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తుని, కోటనందూరు మండలాల తహసీల్దార్‌లు, తుని మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వివిధ పార్టీల నాయకులు ఇచ్చిన సలహాలు, సూచనలతో ఓటర్ల జాబితాను సిద్ధం చేశామన్నారు. అభ్యంతరాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు, ఆయా ప్రాంతాల పేర్లను సవరించామన్నారు. అర్హులు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవడం ఎంతో ఉత్తమమైన మార్గమన్నారు. బీఎల్‌ఓలు సైతం దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వంగలపూడి వాసు (వైఎస్సార్ సీపీ), వంగలపూడి బుజ్జి (టీడీపీ), ఆకెళ్ల శాస్త్రి (బీజేపీ), గాలి శ్రీనివాసరావు (కాంగ్రెస్-ఐ), తుని, కోటనందూరు తహసీల్దార్లు శివకుమార్, కుసరాజు, కమిషనర్ ప్రసాదరాజు, ఎలక్షన్ డీటీ ప్రదీప్, ఆర్‌ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు


బావిశెట్టి చెరువులో మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేట బావిశెట్టి చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. జెడ్.రాగంపేట బావిశెట్టి చెరువులో మట్టిని నీలాద్రిరావుపేటకు చెందిన కొందరు జేసీబీ సాయంతో ట్రాక్టర్ల ద్వారా తరలించి విక్రయాలకు పాల్పడుతున్నారు. దీంతో జెడ్.రాగంపేటకు చెందిన కోరకంటి ఆశాకిరణ్, శ్రీమంతుల కిషోర్, డొకుబుర్ర రాజు, మొర్త మహేష్, గంపల సతీష్ చంద్ర, పల్లేటి యాకోబు, శ్రీకాంత్, పల్లెటూరు రాజు, పెదపూడి అప్పారావు తదితరులు మట్టి తవ్వకాలను అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలించి అధిక సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం నిందితులపై చర్యలు తీసుకోవాలని వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను డిపో మేనేజర్ యు.రామన్నదొర గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 25 వరకూ నెల రోజుల పాటు కార్గో డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా డిపోలో కార్గోకు బుక్ చేసుకున్న వస్తువులు, ఇతర సామగ్రిని భద్రంగా ఇంటికే డెలివరీ చేస్తామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దసరాలో డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా రూ.12.18 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. దీనికి సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ అడ్డాల అప్పారావు, పలు యూనియన్ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం




రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్ దివాన్‌చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లో గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తొలుత సీఎం జగన్‌కు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు.

వైభవంగా దేవీచౌక్ కనకదుర్గమ్మ ఊరేగింపు


గోకవరంలో పూలరథంపై కనకదుర్గమ్మను ఊరేగిస్తున్న భక్తులు


ఊరేగింపులో అలరించిన శక్తి వేషాలు


ఆకట్టుకున్న గరగల నృత్యాలు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ ఊరేగింపు గురువారం కన్నులపండువగా జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూలరథంపై అమ్మవారిని తీన్‌మార్ డ్యాన్స్‌లు, డీజే సౌండ్స్, కాంతారా, వివిధ దేవతల వేషధారణలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు గ్రామంలోని ప్రధాన రహదారి గుండా తెల్లవారుజాము వరకూ సాగింది. ఊరేగింపులో బిక్కవోలు వారి బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా నిమజ్జనాలు

ఏలేశ్వరం: దేవీ శరన్నవరాత్రుల ముగింపులో భాగంగా గురువారం అమ్మవారి విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. స్థానిక తోట వీధిలో దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభించి 40 ఏళ్లు కావడంతో సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఊరేగింపులో విజయనగరం జిల్లాకు చెందిన కళాకారులతో కోలాటం, తీన్‌మార్, డీజే సౌండ్ ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్, బాలాజీ చౌక్, దిబ్బలపాలెం, మార్కెట్ వీధి, పల్లపువీధి మీదుగా అమ్మవారిని ఊరేగించి ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కనకదుర్గమ్మ విగ్రహ నిమజ్జనం

శంఖవరం: దేవీనవరాత్రులు ముగియడంతో మండలంలోని కత్తిపూడి, శంఖవరం, జి.కొత్తపల్లి, గౌరంపేట గ్రామాల్లో కనకదుర్గమ్మ నిమజ్జనోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని ఊరేగించి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. శంఖవరంలో శివశక్తి సాయి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.


ఏలేశ్వరం అమ్మవారి ఊరేగింపులో కోలాట ప్రదర్శన

ఓటే వజ్రాయుధం



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ సత్యనారాయణ మూర్తి


నియోజకవర్గస్థాయి సమావేశానికి హాజరైన బీఎల్‌ఓలు

- నేడు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
- నియోజకవర్గంలో 2,16,973 మంది ఓటర్లు
- ఓటర్ల జాబితాలో మహిళలదే పైచేయి

తుని రూరల్: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 27 నుంచి పోలింగ్ కేంద్రాల్లో డ్రాఫ్ట్ రోల్స్ ప్రచురణ చేస్తున్నట్టు తుని నియోజకవర్గ ఎన్నికల అధికారి సత్యనారాయణ మూర్తి తెలిపారు. నియోజకవర్గంలో 223 పోలింగ్ స్టేషన్ల పరిధిలో సవరించిన జాబితా ప్రకారం 2,16,973 మంది ఓటర్లు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇందులో పురుషులు 1,07,261 మంది, స్త్రీలు 1,09,684 మంది, ఇతరులు 28 మంది, సర్వీసు ఓటర్లు166 మంది ఉన్నారు. ఓటర్ల సంఖ్యలో మహిళలదే పైచేయిగా నిలచింది. ప్రచరించిన ముసాయిదా జాబితాను అర్హులంతా పరిశీలించుకుని అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. ఇంకా ఓటర్లగా నమోదు కాని 18 సంవత్సరాలు నిండినవారు ఎవరైనా ఉంటే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇందు కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు ఈఆర్‌ఓ తెలిపారు. తుది ఓటర్ల జాబితాను 2024 జనవరి 5న ప్రచరిస్తామన్నారు.

ప్రత్యేక శిబిరాలు

ఈ నెల 27న ప్రచరించే ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను డిసెంబర్ 9వ తేదీ వరకూ పోలింగ్ కేంద్రాలు వద్ద బీఎల్‌ఓలు స్వీకరిస్తారు. మార్పులు, చేర్పులతో పాటు కొత్తగా ఓటర్లగా నమోదయ్యేందుకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇందుకు గాను ఈ నెల 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తారు. అభ్యంతరాలు, దరఖాస్తులను డిసెంబరు 26న పరిష్కరిస్తారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా వెల్లడిస్తారు. ఆ జాబితా ప్రకారం సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవలసి ఉంది.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

ప్రజాస్వామ్యంలో కీలకపాత్ర ఓటర్లదే. పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు చేస్తున్నాం. అపోహలకు, అపార్థాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా రాజకీయ పార్టీల నాయకులతో తరుచూ సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు తీసుకుంటున్నాం. బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించాం.

– సత్యనారాయణ మూర్తి, ఈఆర్‌ఓ, తుని

నియోజకవర్గంలో మండలాల వారీగా పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల సంఖ్య

మండలం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
తుని రూరల్	71	64484
తుని పట్టణం	39	41932
తొండంగి	72	72161
కోటనందూరు	41	38405
మొత్తం	223	2,16,973

గౌరీదేవి ఉత్సవాలు ప్రారంభం

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి, గెద్దనాపల్లి గ్రామాల్లో గౌరీదేవి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో గౌరీదేవి విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామాల్లో ఊరేగించి ప్రతిష్ఠించారు. తొలుత వరి దుబ్బుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. 40 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- తాళ్లూరులో వాటర్ ట్యాంకు ప్రారంభం


తాళ్లూరులో లబ్ధిదారులకు ఇంటిస్థలం పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గండేపల్లి: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తాళ్లూరులో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.77.72 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంక్, పైపు లైన్లు, కుళాయిలను గురువారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే అదనపు వాటర్ ట్యాంక్ నిర్మించామన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. అనంతరం ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిన్ని వీరబాబు, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, బొర్రంపాలెం సర్పంచ్ పోకల సుబ్బు, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట జేసీఎస్ మండల కన్వీనర్ బండారు రాజా, జక్కిలింక రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.